క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం : కొరుప్రోలు సబ్‌స్టేషన్ పరిధిలో మెయింటినెన్స్ పనులు కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలుపుతున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. గుడివాడ, గుర్రాజుపేట , బంగారమ్మపాలెం పరిశ్రలకు, చినఉప్పలం ఆక్వా చెరువులకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు. గుడివాడ ఫీడర్ మీద సరఫరా అవుతున్న గ్రామాలు గుడివాడ, పెదఉప్పలం, ఎల్‌పీఆర్ పేట, గుడివాడ, కె.పోలవరం, ఆర్.పోలవరం, చినఉప్పలం, బంగారమ్మపాలెం గ్రామాలకు కూడా విద్యుత్ అంతరాయం ఉంటుందని చెప్పారు. ఈ మేరకు వినియోగదారులు సహకరించాలన్నారు.

ప్రైవేట్ వసతి గృహం తనిఖీ



కిచెన్ రూమ్‌ను పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పాయకరావుపేట : ఎస్.నర్సాపురం గ్రామంలో గల సీసీఐఎంఏ ప్రైవేట్ వసతి గృహాన్ని బుధవారం తనిఖీ చేసినట్టు రెవెన్యూ ఇన్స్పెక్టర్ త్రినాథ్ తెలిపారు. వసతి గృహంలో 89 మంది విద్యార్థులు (బాలురు) ఉన్నారన్నారు. వసతి గృహంలో విద్యార్థులకు పడక గది, మంచాలు, కిచెన్‌రూమ్ సక్రమంగానే నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థులకు మినరల్ అందిస్తున్నట్టు తెలిపారు. ఈయనతో పాటు రీసర్వే డీటీ రాజేంద్రప్రసాద్, వీఆర్వో శేషు, వీఆర్ఏ వెంకటలక్ష్మి ఉన్నారు.

కృష్ణాలయానికి డ్రమ్స్ వితరణ



మునగపాకలోని శ్రీకృష్ణుని దేవాలయానికి దాత ప్రసాద్ బహుకరించిన డ్రమ్స్

మునగపాక : మునగపాకలోని సంతబయిల శ్రీ కృష్ణుని దేవాలయానికి శరగడం ప్రసాద్ డ్రమ్స్ సమకూర్చారు. ఇటీవలే ప్రతిష్ఠించిన ఆలయానికి సుమారు రూ.16,800 విలువ చేసే డ్రమ్స్‌ను ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ప్రసాద్‌ను కమిటీ సభ్యులు అభినందించారు.

శ్రీనివాసుని ఆలయ నిర్మాణానికి విరాళాలు



ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాతలు

మునగపాక : మునగపాకలో రూ.4కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న శ్రీనివాసుని ఆలయ నిర్మాణంలో పలువురు భక్తులు భాగస్వాములవుతున్నారు. ఆలయ నిర్మాణంలో భాగంగా తమవంతు సాయం అందజేస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం రాత్రి మునగపాకకు చెందిన వెలగా శ్రీరాములు జ్ఞాపకార్థం కుమారుడు సురేష్-నూక రామలక్ష్మి దంపతులు రూ.30,116 నగదును కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. కింతాడ గోవింద రూ.1,116, విల్లూరి లచ్చన్న రూ.1100, దొడ్డి నాగప్పారావు రూ.2120, బుద్దరాజు-హారిక దంపతులు రూ.1015, మళ్ల పద్మ రూ.1015 వంతున విరాళాలు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కాండ్రేగుల జగ్గారావు, కోనపల్లి రామ్మోహనరావు, వెలగా శ్రీనివాసరావు, ఆడారి లక్ష్మణరావు, మోహనరావు, విల్లూరి మోహన్, జల్లేపల్లి కిష్టప్ప పాల్గొన్నారు.

నేడు మరిడి మహాలక్ష్మితల్లి పండగ

నాతవరం: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి మరిడి మహాలక్ష్మి తల్లి పండగను గురువారం నాతవరంలో ఘనంగా నిర్వహించనున్నారు. పండగ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయకమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. మండలంలో వల్సంపేట వై.బి.పట్నం యం.బి.పట్నం గ్రామాల్లో కూడా శ్రీమరిడిమ్మ తల్లి పండగను గ్రామస్తులు జరుపుకోనున్నారు.

రంగులు మార్చే పాలన

- వెల్‌నెస్ సెంటర్లకు వైట్‌వాష్
- జగన్ పాలనలోని అభివృద్ధిని కప్పిపుచ్చడమే ధ్యేయం
- కూటమి ప్రభుత్వ వైఖరిపై విమర్శలు



కూటమిప్రభుత్వం వచ్చేక వెల్‌నెస్ సెంటరుకు వైట్‌వాష్ చేసిన దృశ్యం



గత ప్రభుత్వ హయాంలో ఉద్దండపురంలో ఆకర్షనీయంగా నిర్మించిన వెల్‌నెస్ సెంటరు

నక్కపల్లి : గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలు వివిధ పనుల కోసం మండల కేంద్రాలకు తిరగాల్సిన అవసరం లేకుండా గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకు వచ్చింది. ఈ సచివాలయాల్లో ప్రజలకు అత్యవసర సేవలు అందించేందుకు 12 ప్రభుత్వ శాఖల సిబ్బందిని నియమించింది. ఈ సిబ్బంది తమ విదులు నిర్వర్తించేందుకు వీలుగా అన్ని సదుపాయాలతో కూడిన ప్రత్యేక భవనాలు నిర్మించింది. దీనిలో భాగంగా గ్రామాల్లో రూ.40 లక్షల వ్యయంతో సచివాలయాలు, రూ.20 లక్షల వ్యయంతో రైతు భరోసా కేంద్రాలు, మరో రూ.20 లక్షల వ్యయంతో వెల్‌నెస్ సెంటర్లు (గ్రామీణ వైద్యకేంద్రాలు) నిర్మించింది, ఈ వ్యవస్థ ద్వారా గ్రామాల్లో ప్రజలంతా గడచిన ఐదేళ్లలో తమ పనులు, పట్టాదారు పాసుపుస్తకాలు, వివిధ ధ్రువపత్రాలు, వివాహ ధ్రువపత్రాలు, విత్తనాలు, ఎరువులు, వైద్య సేవల కోసం మండల కేంద్రాలకు వెళ్లే అవసరం రాలేదు. అన్ని పనులు గ్రామాల్లో నిర్మించిన సచివాలయం రైతు భరోసా కేంద్రాల ద్వారానే పొందడం జరిగేది. వైద్యసేవల కోసం నిర్మించిన వెల్‌నెస్ సెంటర్లో కూడా ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉంటూ ప్రాథమిక వైద్యం అందించేవారు. చిన్న చిన్న వైద్య సేవలకోసం పరీక్షల కోసం సమీపంలో ఉన్న పీహెచ్‌సీలకు కూడా వెళ్లే అవసరం ఉండకుండా వెల్‌నెస్ సెంటర్లు బాగా ఉపయోగపడ్డాయి. ఈ విధానం సత్ఫలితాలు ఇచ్చింది. అయితే సార్వత్రిక ఎన్నికలు రావడం ప్రభుత్వం మారడంతో కూటమి ప్రభుత్వ పెద్దల కళ్లు ఈ సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్లపైనే పడ్డాయి. ఈ భవనాల వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాలు ధ్వంసం చేయడం, సచివాలయం, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్ల పేర్లు తొలగించడం, అప్పటి ముఖ్యమంత్రిజగన్‌మోహన్ రెడ్డి ఫొటోలు తీసేయడం వంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారు. కొన్ని జిల్లాల్లో ఈ భవనాలకు పసుపు రంగులు పూసారు. ఇదే తరహా సంఘటన నక్కపల్లి మండలం ఉద్దండపురంలో జరిగింది. మండలం లో గత ప్రభుత్వం 20 వెల్‌నెస్ సెంటర్లు మంజూరు చేసింది. ఒక్కో భవనం నిర్మాణానికి రూ.20.80లక్షలు మంజూరు చేసింది. యాభై శాతం ఎన్‌హెచ్ఆర్ఎం నిధులు, యాభై శాతం ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో వీటిని నిర్మిస్తున్నారు. వీటిలో ఉద్దండపురం, కాగిత, డీఎల్‌పురంలలో భవనాలు పూర్తయి, ప్రారంభోత్సవాలు జరిగి కార్యకలాపాలు జరుగుతున్నాయి. తాజాగా ప్రభుత్వ పెద్దల కళ్లు వీటిపై పడ్డాయి. కొద్దిరోజుల క్రితం ఉద్దండపురంలో పూర్తయిన వెల్‌నెస్ సెంటర్‌కు రంగులు మార్చేసారు. వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల నుంచి తమకు ఆదేశాలు వచ్చాయంటూ గత ప్రభుత్వం నిర్మించిన భవనాలకు రంగులు మార్చే కాంట్రాక్టు పొందిన వ్యక్తి ఈ వెల్‌నెస్ సెంటరుకు వైట్‌వాష్ వేశారు. ఈ భవనంపై రాసిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ పేరు కనిపించకుండా స్టిక్కర్లు అతికించారు. గత ప్రభుత్వంలో ఆకర్షనీయమైన రంగులు వేసి వివిధ వైద్యపరికరాల బొమ్మలు వేసి సర్వాంగ సుందరంగా నిర్మించిన ఈ భవనానికి వైట్‌వాష్ వేయడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి, ఈ భవనాన్ని స్థానిక సర్పంచ్ పొడగట్ల వెంకటేశ్వరరావు నిర్మించారు, భవనం సకాలంలో పూర్తి చేసి అప్పగించడం జరిగిందని, తనకు ఇంకా సుమారు ఆరు లక్షల రూపాయల బిల్లులు చెల్లించాలని ఆయన తెలిపారు. ప్రజలకు సత్వర సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో బిల్లులు అందకపోయినప్పటికీ ప్రభుత్వానికి అప్పగించడం జరిగిందని, బిల్లులు చెల్లించకపోగా ఆకర్షణీయంగా నిర్మించిన ఈ భవనానికి రంగులు మాత్రం ఆగమేఘాల మీద మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని మండి పడ్డారు. వైట్‌వాష్ చేస్తున్న వ్యక్తిని నిలదీస్తే తమకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని , అందుకే మారుస్తున్నామని సమాధానం చెప్పారని ఆయన పేర్కొన్నారు. తామంతా నిలదీయడంతో కేవలం వైట్‌వాష్ మాత్రమే చేసి వెళ్లిపోయారన్నారు. ఈ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టకపోగా నిర్మించిన భవనాలకు రంగులు మార్చడం పేర్లు తొలగించడం, శిలా ఫలకాలు ధ్వంసం చేయడం వంటి దుర్మార్గపు చర్యలు చేపట్టడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయాన్ని సర్పంచ్ బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీశారు.

అభివృద్ధిని చెరిపేయలేరు



గత ప్రభుత్వం చేసిన అభివృద్ధిని కప్పిపుచ్చడమే పనిగా ఈ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. భవనాలకు రంగులు, పేర్లు తొలగించిన ంత మాత్రాన జరిగిన అభివృద్ధిని చెరిపేయలేరు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ భవనాలను ఉపయోగించుకుని మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు కృషి చేయాలి. అయినా బిల్లులు చెల్లించకుండా రంగులు మార్చే అధికారం ఎవరిచ్చారు. ఈ విధానం సరికాదు. ఫైనల్ బిల్లులు చెల్లించే సమయంలో క్వాలిటీ కంట్రోలు అధికారులు వివరణ కోరితే ఎవరు బాధ్యత వహిస్తారు.

–పొడగట్ల వెంకటేష్, సర్పంచ్ ఉద్దండపురం

విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థినులకు సూచనలిస్తున్న విశ్రాంత ప్రిన్సిపాల్ ధాక్టర్ శరగడం నూకరాజు

యలమంచిలి రూరల్ : విద్యార్థినులకు ఇంటర్మీడియట్ దశ ఎంతో కీలకమని, ప్రణాళికాబద్ధంగా అభ్యాసం చేస్తే రసాయనశాస్త్రంలో మంచి మార్కులు సాధించవచ్చని విశ్రాంత ఏఎంఏఎల్, ఆస్క్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, రసాయన శాస్త్ర అధ్యాపకుడు ధాక్టర్ శరగడం నూకరాజు సూచించారు. బుధవారం పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల ప్లస్-2 విద్యార్థినులకు ఆయన రసాయనశాస్త్రంతో పాటు పలు సమకాలీన అంశాలు, దేశంలో మహిళలు, విద్యార్థినులపై జరుగుతున్న పలు వర్తమాన సంఘటనల గురించి వివరించారు. ముఖ్యంగా బాలికలపై రోజురోజుకూ పెరుగుతున్న లైంగిక వేధింపుల ఘటనలను ఎలా ఎదుర్కోవాలో, అందుకు రక్షణగా ఉన్న పోక్సో చట్టాల గురించి ఆయన వివరించారు. లైంగిక వేధింపులుపై అనుమానం వస్తే వెంటనే అప్రమత్తం కావాలని సూచించారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా రసాయన శాస్త్రంలో చాప్టర్ల గురించి ఆసక్తికరంగా వివరించారు. అనంతరం నూకరాజును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇంఛార్జి ప్రధానోపాధ్యాయురాలు ప్రశాంతి, అధ్యాపకులు మువ్వల రాంబాబు, పద్మకుమార్, పద్మాకర్, శ్రీనివాస్, ఆనందరాజు పాల్గొన్నారు.

నేడు పొలిమేరమ్మ జాతర



కొత్త ఎర్రవరంలో కొలువుదీరిన పొలిమేరమ్మ తల్లి

యలమంచిలి రూరల్ : పట్టణంలోని కొత్త ఎర్రవరంలో పొలిమేరమ్మతల్లి జాతర మహోత్సవం గురువారం జరగనుంది. ఇందు కోసం ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. జాతరను పురస్కరించుకుని పాత జాతీయరహదారి పక్కన ఉన్న అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయం, పరిసర ప్రాంతాల్లో భారీ విద్యుత్ దీపాలంకరణ చేశారు. అమ్మవారి దర్శనానికి యలమంచిలి పట్టణం, పాత ఎర్రవరం, సోమన్నపాలెం, బీరకాయలపాలెం, లైనుకొత్తూరు, మర్రిబంద తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరానుండడంతో వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, పెద్ద ఎత్తున బాణసంచా కాల్చడానికి ఉత్సవ కమిటీ కార్యాచరణ రూపొందించింది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా, ఎలాంటి గొడవలు జరగకుండా పట్టణ పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

మండలి ప్రతిపక్ష నేతగా బొత్స ఎంపిక పట్ల హర్షం



వీసం రామకృష్ణ

నక్కపల్లి : ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికయిన మాజీ మంత్రి వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణను శాసన మండలిలో ప్రతిపక్ష నేతగా ఎంపిక చేస్తూ పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకోవడం పట్ల కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ విశాఖ జిల్లా ఎమ్మెల్సీగా ఎంపిక చేయడంతో పాటు ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యేందుకు జగన్‌మోహన్‌రెడ్డి అన్ని చర్యలు తీసుకున్నారన్నారు. తాజాగా బొత్సను శాసన మండలి ప్రతిపక్షనేతగా ప్రకటించి కేబినెట్ హోదా కల్పించడం పట్ల పార్టీ శ్రేణుల్లో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఉత్తరాంధ్రలో పార్టీకి పెద్దదిక్కుగా పార్టీని మరింత పటిష్ట పరిచేందుకు బొత్స ఎంతో కృషి చేస్తారన్నారు. శాసన మండలి ప్రతిపక్షనేతగా ఎంపిక కాబోతున్న బొత్స సత్యనారాయణకు మండల వైఎస్సార్‌సీపీ తరపున అభినందనలు తెలుపుతున్నామన్నారు.

జీవన ఎరువులతో ఆరోగ్యకర పంటలు



మాట్లాడుతున్న వ్యవసాయ సహాయ సంచాలకులు రామారావు

మునగపాక : సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం సాగు చేయడం శ్రేయస్కరమని అనకాపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు డాక్టర్ రామారావు తెలిపారు. మోతాదుకు మించి ఎరువులను వినియోగించడం అనర్ధదాయకమన్నారు. అరబుపాలెంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువులను వినియోగించరాదన్నారు. జీవన ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. తద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని అలాగే దిగుబడులు పెంచుకోవచ్చన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. మండల వ్యవసాయాధికారి సీహెచ్ జ్యోత్స్నకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, వ్యవసాయ సహాయకులు సత్య రవి రాజ్, రైతులు బి.సత్యనారాయణ, మళ్ల శివకృష్ణ, నాగేశ్వరరావు, ధర్మారావు పాల్గొన్నారు.

స్వీపర్లే సెలైన్లు ఎక్కిస్తున్నారు



ఏరియా ఆస్పత్రిలో అసౌకర్యాలపై వివరిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు మధు



ప్రభుత్వ భవనాలకు రంగులు మార్చడంపై సమావేశంలో నిలదీస్తున్న సర్పంచ్ వెంకటేష్

- ఏరియా ఆస్పత్రిలో అధ్వాన పరిస్థితులు
- మండల సమావేశంలో సభ్యుల ధ్వజం

నక్కపల్లి : మండల కేంద్రం నక్కపల్లిలో ఉన్న 50 పడకల ఏరియా ఆస్పత్రిలో వైద్యసేవలు అధ్వానంగా ఉన్నాయని, స్వీపర్లే రోగులకు సెలైన్లు ఎక్కించే దుస్థితి నెలకొందంటూ బుధవారం జరగిన మండల సర్వసభ్య సమావేశంలో అధికార పార్టీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు ఆరోపించారు. ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వేంపాడు ఎంపీటీసీ సభ్యుడు(టీడీపీ) కుంచా మధు మాట్లాడుతూ ఏరియా ఆస్పత్రిలో ఒక వైద్యురాలు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. ఇక్కడ స్వీపర్లే రోగులకు సెలైన్లు ఎక్కించడం, ప్రాథమిక వైద్యం అందించడం తాను స్వయంగా చూశానని తెలిపారు. వేంపాడు పాఠశాలలో రూ.24 లక్షలతో నాడు నేడు పథకం కింద అభివృద్ధి పనులు నిర్వహించారని ఈ పనులకు సంబంధించి హెచ్ఎం వివరాలు ఇవ్వలేదన్నారు. ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వడం లేదన్నారు. అధికారులే రాజకీయ నాయకుల్లా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఉద్దండపురం సర్పంచ్ పొడగట్ల వెంకటేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌కు పూర్తిగా బిల్లులు చెల్లించకుండానే వైద్యశాఖ అధికారులు రంగులు మార్చారని మండిపడ్డారు. రంగులు మార్చే అధికారం మీకు ఎవరిచ్చారని నిలదీశారు. తనకు ఇంకా ఆరులక్షల రూపాయాలు రావాల్సి ఉందన్నారు. మండలానికి 20 గోకులం షెడ్లు మంజూరయ్యాయని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో భాగ్యలక్ష్మి చెప్పగా 32 పంచాయతీలు ఉండగా 50 షెడ్లు మంజూరు చేయడం ఏమిటని ఆయన నిలదీశారు. కాగిత ఎంపిటీసీ సభ్యుడు ఆకేటి గోవిందరావు(జనసేన) మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు కోరిన సమాచారం సకాలంలో ఇవ్వాలన్నారు,. తప్పుడు సమాచారం ఇస్తున్నారని, పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. మండల పరిషత్ నిధుల నుంచి నిర్మించే చేతి బోర్ల విషయంలో చినతీనార్ల ఎంపీటీసీ సభ్యుడు (టీడీపీ) వాసపల్లి అప్పలస్వామి ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ నాగభూషణంపై పరుష పదజాలంతో మాట్లాడడంపై ఏఈ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు సార్లు మీ గ్రామానికి రిగ్గు పంపించడం జరిగిందని, సరైన స్థలం చూపించకపోవడంతో బోరు నిర్మించలేదన్నారు. తప్పు మీవైపు ఉంచుకుని తనపై ఆగ్రహం వ్యక్తం చేయడం సరికాదన్నారు, సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, తహసీల్దార్ అంబేడ్కర్, ఎంపీడీవో శ్రీనివాసరావు, పరిపాలనాధికారి సీతారామరాజు పాల్గొన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా బంద్ ప్రశాంతం



పట్టణంలో ఓ ప్రైవేటు స్కూల్ వద్ద ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు



డీబీపీ ర్యాలీని నిర్వహిస్తున్న దృశ్యం



ఎస్.రాయవరంలో స్టేట్ బ్యాంకు మూయిస్తున్న బంద్ యువకులు



మునగపాక హైస్కూల్‌ను మూయించివేసిన నిరసనకారులు



పాయకరావుపేటలో రోడ్డు పై బైఠాయించి బంద్ జరిపించిన దళిత నాయకులు



మునగపాక రోడ్డులో నిలిచిన వాహనాలు

పాయకరావుపేట : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి పాయకరావుపేట డివిజన్ నాయకులు పట్టణంలో బుధవారం చేసిన బంద్ ప్రశాంతంగా విజయవంతం అయింది. దళిత నాయకులు పెదపాటి మేఘరంజన్, నెలపర్తి అర్జున్, ఇంజరపు సూరిబాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై ఇచ్చిన అప్రజాస్వామిక, రాజ్యాంగ విరుద్ధమైన తీర్పును నిరసిస్తూ బంద్ చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో గల మెయిన్‌రోడ్డు నందు గల దుకాణాలు, కిరణా షాపులు, షాపింగ్ మాల్స్ మూయించేసారు. అదే విధంగా బ్యాంకులు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు మూసివేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలు మూసివేయించారు. అలాగే రోడ్డుపై ఆటోలు కూడా బంద్ చేయించారు. పట్టణంలో మెయిన్‌రోడ్డు, మంగవరం రోడ్డు, లింగాల కాలనీ, గౌతమ్ సెంటర్, సూర్యమహల్ సెంటర్, బైపాస్ రోడ్డు తదితర కూడళ్ల వద్ద దుకాణాలు, కిళ్లీ బడ్డీలు మూసి వేయించారు. ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐలు పి.అప్పలరాజు, జి.అప్పన్న భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. ఈ బంద్ కార్యక్రమంలో దళిత నాయకులు పల్లా ప్రసాద్, కువ్వల కుమార్, పల్లి దుర్గ, గారా చంటి, మక్కుడుపల్లి నాగరాజు, ఐఎస్ మూర్తి, తాటిపాక లోవరాజు, తదితరులు పాల్గొన్నారు. దళిత బహుజన పార్టీ ఆధ్వర్యంలో కూడా ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బంద్ ప్రకటిస్తూ ర్యాలీ నిర్వహించారు. డీబీపీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీబీపీ జిల్లా అధ్యక్షుడు దువ్వాడ దావీదు, డీబీపీ రాష్ట్ర నాయకురాలు దాసరి అన్నపూర్ణ, మాల మహానాడు రాష్ట్ర నాయకులు దాసరి రామచంద్రరావు, పాల్గొన్నారు.

విద్యాసంస్థల మూసివేత

యలమంచిలి రూరల్ : ఎస్సీ వర్గీకరణకు నిరసనగా రిజర్వేషన్ బచావో పిలుపు మేరకు బుధవారం యలమంచిలి పట్టణంలో దళిత, అంబేడ్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో బంద్ పాక్షికంగా జరిగింది. ప్రభుత్వ,ప్రైవేటు విద్యాసంస్థలను ఆందోళనకారులు మూసివేయించారు. స్థానిక దిమిలి రోడ్డు కూడలి అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల నాయకులు రాస్తారోకో చేసి ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పట్టణ ఎస్ఐ కె.సావిత్రి నేతృత్వంలో పట్టణంలో రైల్వేస్టేషన్, బస్ కాంప్లెక్స్ సహా పలు ప్రధాన కూడళ్ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. గొంపాని అప్పారావు, బొచ్చ అప్పారావు, ఈరిగిల చంటి, గొంపాని శివ, మురళీరాజు, రాము పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : మండలంలో భారత్‌బంద్ ప్రశాంతంగా నిర్వహించారు. ఇటీవల సుప్రీం కోర్టు ఆరికల్ 341, 342కి వ్యతిరేకంగా ఎస్సీ వర్గీకరణకి అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో, కోర్టు తీర్పునకు వ్యతిరేకంగా ఈ బుధవారం భారత్‌బంద్ నిర్వహించారు. ఎస్.రాయవరంలో పలు దుకాణాలు, పాఠశాలలు, బ్యాంకులు మూయించారు. నిరసనలో ఎంపీటీసీ బైపా శ్రీనివాసరావు, యువకులు గారా శ్రీను, సతీష్, జె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మునగపాకలో పాక్షికంగా...

మునగపాక : ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం మునగపాకలో దళితులు ఆందోళనకు దిగారు. ఉదయం 5 గంటల నుంచి రోడ్డుపైకి వచ్చి భారత్‌బంద్ నిర్వహించారు. పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలను మూయించారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునరాలోచించాలని కోరుతూ పలువురు దళితులు మునగపాక మెయిన్‌రోడ్డులో మానవహారం, రాస్తారోకో నిర్వహించారు. అంబేడ్కరిజమ్ పునాది అసోసియేషన్ కన్వీనర్ రాజాన బుజ్జిబాబు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఎస్సీల వర్గీకరణకు ఇచ్చిన తీర్పు సరికాదన్నారు. దీని వల్ల ఎస్సీలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. కాగా బంద్ కారణంగా పూడిమడక రోడ్డులో వాహనాలు నిలిచిపోయాయి. ఏఎస్ఐలు మన్మథరావు, దేవన్న ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగు చర్యలు తీసుకున్నారు. ఆందోళనలో కోనపల్లి రామ్మోహనరావు, దిమ్మల అప్పారావు, పోతురాజు, పిల్లి అప్పారావు, పిట్టా అప్పారావు, గుంట్ల అప్పారావు, కంకణాల శ్రీనివాసరావు, లంబా అప్పారావు, బీలా లక్ష్మణరావు, లంబా అర్జునరావు, నవీన్, దిమ్మల శివ, గణేష్, శివ గణేష్ పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల గుర్తింపులో మార్పులు చేయాలి

దేవరాపల్లి: ఉపాధి హామీ పథకంలో ఈ నెల 23న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే గ్రామ సభల్లో పనుల గుర్తింపులో మార్పులు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న కోరారు. ఈ మేరకు స్థానిక ఉపాధి హామీ పథకం ఏపీవో చంద్రకళకు సీపీఎం మండల కార్యదర్శి బి.టి.దొరతో కలిసి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువులు, లింక్ రోడ్లు, శ్మశాన వాటికలకు రోడ్ల నిర్మాణాలు తదితర పనులు చేపట్టాలని కోరారు. ప్రస్తుతం ఉపాధి హామీ పథకంలో కూలీలకు ఉపయోగపడే పనులు తక్కువగా ఉన్నాయని, మెటీరియల్ చార్జ్ ద్వారా చేపట్టే పనులు ఎక్కువగా ఉన్నాయని, వీటిని మార్పు చేయాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో మందుల స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

కె.కోటపాడు : గొండుపాలెంలో సమాజ మిత్ర వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, సర్పంచ్ బండారు కనక మల్లీశ్వరి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. విశాఖపట్నానికి చెందిన కేర్, వాసన్ ఐ కేర్, మహాత్మగాంధీ కేన్సర్ ఆస్పత్రులకు చెందిన వైద్యులు సుకన్య, శ్వేత, చికితాలు 219 మందికి వైద్యసేవలందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పైలా ప్రసాదరావు, రొంగలి మహేష్, ఎంపీటీసీ వంటాకు నారాయణమ్మ, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ దొగ్గ ఉమాశంకర్, సమాజ మిత్ర వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ పీలా శ్రావణ్‌కుమార్, వంటాకు నరేంద్రవర్మ పాల్గొన్నారు.